క్లుప్తంగా

పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: హిందూపురంలో ఈనెల 10న జరిగే వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికను ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఆహ్వానించారు. హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దీపికకు మంగళవారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా దీపిక జిల్లా స్థాయి సమావేశ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, నాయకులు శ్రీరాములు, శివన్న, అంబేడ్కర్ నవీన్, నరసింహులు, మద్దిలేటి, నారాయణపప్ప తదితరులు పాల్గొన్నారు.

10న ఎస్సీ సెల్ జిల్లాస్థాయి సమావేశం

మడకశిర: హిందూపురంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 10న ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరావు, జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, రాష్ట్ర, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు, కార్యవర్గసభ్యులు హాజరవుతారన్నారు. సమావేశంలో ఎస్సీలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతంపై కూడా ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పెన్షనర్ల అసోసియేషన్ ఏర్పాటు



నూతన సభ్యులను సన్మానించిన దృశ్యం

మడకశిర: నియోజకవర్గంలోని పెన్షనర్లు మడకశిరలో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర కార్యదర్శి ఆత్మారెడ్డి, జిల్లా కార్యదర్శి నాగార్జున శెట్టి ఆధ్వర్యంలో నూతన అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు.తాలూకా అధ్యక్షుడిగా మల్లికార్జున, గౌరవాధ్యక్షుడిగా శాంతవీరప్ప, అసోసియేట్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యాచారి, ఉపాధ్యక్షుడిగా గణపతి, రంగప్ప, ఈశ్వరప్ప, ప్రభాకర్, పుట్టకామప్ప, కార్యదర్శిగా ఫక్రుద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా మల్లికార్జున, జబీర్, తిమ్మప్ప, సత్యనారాయణాచారి, స్వారప్ప, కోశాధికారిగా రాజారావును ఎన్నికయ్యారు.

వేరుశనగ పంట పరిశీలన

గుడిబండ: మండల పరిధిలోని చిగతుర్పికి చెందిన రైతు నరసింహప్ప పొలంలో వేసిన వేరుశనగ పంటను మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులకు వేరుశనగ పంటపై అవగాహన కల్పించారు.

అధ్వానంగా బళ్లారి రోడ్డు



గుంతలు పడిన బళ్లారి రోడ్డు

పెనుకొండ: మండలంలోని బళ్లారి రోడ్డు అధ్వానంగా మారింది. సోమందేపల్లి, పెనుకొండ, రొద్దం మండలాలను కలుపుతూ కర్ణాటక మీదుగా బళ్లారి వెళ్తుంది. ముఖ్యమైన ఈ రహదారి ఎక్కడ చూసినా గుంతలు పడటంతో రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. గతంలో ఈ రోడ్డు నిర్మాణానికి మంత్రిగా పని చేసిన రామచంద్రారెడ్డి తగిన సహకారం అందించి ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూశారు. అనంతరం కొన్ని పనులు చేపట్టినా సగం రోడ్డును అధికారులు అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఎల్‌జీబీ నగర్ నుంచి అడదాకులపల్లి అడ్డరోడ్డు వరకు, రంగేపల్లి రైల్వేస్టేషన్ వద్ద పెద్దపెద్ద గుంతలు పడడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఈ రోడ్డును మరమ్మతు చేయించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో పట్టు కేంద్రం



పెచ్చులూడిన భవనం పైకప్పు

మడకశిరరూరల్: మండల పరిధిలోని తడకలపల్లి సమీపంలో 1986 సంవత్సరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - పట్టు పరిశ్రమశాఖ నిర్మించిన విదేశీ పట్టు గ్రుడ్ల ఉత్పత్తి కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం లోపల అంతా ఎక్కడా చూసిన పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతుండడంతో ఆశాఖ అధికారులు కార్యాలయం బయటే కుర్చొని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని శిథిలావస్థకు చేరుకున్న భవనానికి మరమ్మతులు చేసి పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



భవనం బయటే కూర్చున్న ఏడీఏ కె రాజునాయక్

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

చిలమత్తూరు: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశ వేదిక అధికారుల మధ్య వాగ్వాదంతో రచ్చకెక్కింది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల మీట్‌లో చిలమత్తూరు పంచాయతీ కార్యదర్శి సావిత్రి, ఆర్‌ఐ నేలకోటప్ప మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చిలమత్తూరు మేజర్ పంచాయతీలో అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఎంపీపీ.. పంచాయతీ కార్యదర్శి సమాధానం చెప్పాలని కోరారు. తమకు ఎస్‌డబ్ల్యూపీసీ లేదని, తహసీల్దార్‌కు స్థలం కావాలని లెటర్ కూడా పెట్టామన్నారు. ఎన్నిసార్లు వెళ్లినా ఆయన అందుబాటులో లేరని, అసలు ఆయన కార్యాలయానికే రారనడంతో వివాదం చెలరేగింది. ఆర్‌ఐ నేలకోటప్ప, కార్యదర్శి సావిత్రి మధ్య మాటల యుద్ధం సాగింది. వివాదం పెరగడంతో ఎంపీపీ కలుగజేసుకొని ఇది సర్వసభ్య సమావేశంలా లేదని, బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు ఇలా వాదులాడుకోవడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. కార్యదర్శి సావిత్రి తీరుపై ఆయన మండిపడ్డారు. ఎంపీడీఓ రమణమూర్తి మాట్లాడుతూ పారిశుధ్య విషయంలో తాను చెప్పినా కార్యదర్శులు వినడం లేదని మాట్లాడటం గమనార్హం. చిలమత్తూరు పంచాయతీలో రూ.86 లక్షల నిధుల దోపిడీపై వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ప్రశ్నించారు. అధికారిపై చర్యలు తీసుకున్నారని, కానీ నిధులు ఎవరు కాజేశారు, నిధుల రికవరీపై నోరుమెదపకపోతే ఎలా అని ప్రశ్నించారు. కార్యదర్శి స్పందిస్తూ తాను ఉన్నప్పుడు జరగలేదని, పైగా దానిపై విచారణ జరుగుతోందన్నారు. అధికారులు సమస్యలు పరిష్కారం చూపకుండా ప్రశించిన వారిపై తిరిగి ప్రశ్నలు వేయడం మంచి పద్ధతి కాదని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.



పంచాయతీ కార్యదర్శి సావిత్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం వైద్యాధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బోయపేట పీహెచ్‌సీలో సీఓ రమేష్ బాబుకు ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు జానకి, శివమ్మ, ఆయిషా, సుకన్య, నాగజ్యోతి, సుశీలమ్మ, అశ్వత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యంకు ఆశావర్కర్లు వినతిపత్రం అందించారు.

గుడిబండ: గ్రామ స్థాయిలో ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని సీహెచ్‌ఓ క్రిష్ణవేణికి మంగళవారం ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. లేనిపక్షంలో ఆందోళ ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అగళి: ఆశా కార్యకర్తలను సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు సాంబశివ, త్రివేణి, ప్రధాన కార్యదర్శి సౌభాగ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డాక్టర్ శివనందకు వినతి పత్రం అందజేశారు.

మడకశిరరూరల్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని డాక్టర్ శృతికి అందజేశారు.



బోయపేట పీహెచ్‌సీలో సీఓ రమేష్ బాబుకు వినతిపత్రమిస్తున్న ఆశావర్కర్లు

రాజేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలి



హిందూపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



పెనుకొండ: రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని హిందూపురం న్యాయవాదుల సంఘం ఖండించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నేరువప్ప, కార్యదర్శి రామచంద్రప్పల ఆధ్వర్యంలో న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ మంగళవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగరాజురెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగప్ప, రామిరెడ్డి, హిదయతుల్లా ఖాన్, గోపాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

హిందూపురం: దేశ ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడి అమానుషమని దీనిని ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తోందని యూటీయూసీ రాష్ట్ర కన్వీనర్ ఏ శ్రీనివాసులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్లకార్డులతో నిరసన తెలిపింది. జిల్లా అధ్యక్షుడు లాయర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడం హేయమని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. న్యాయవాది రాజేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి రాజేష్ కిషోర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రామాంజినేయులు, మాజీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎంఎస్ మూర్తి, బహుజన ఐక్యవేదిక నాయకులు శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి

రొళ్ల: ఇతర ఉపాధ్యాయుల మాదిరిగానే 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని ఎంటీఎస్ ఉపాధ్యాయులు కోరారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం సమావేశం మందిరం ఆవరణలో 1998 డీఎస్సీ వివిధ పాఠశాలలో పని చేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఉద్యోగ భద్రత కోసం ఈనెల 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న విజ్ఞాపన సభకు తరలిరావాలని కోరారు.

9 నుంచి బ్యాంక్ సేవలు బంద్

లేపాక్షి: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఈనెల 9 సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 10 గంటల వరకూ బ్యాంక్ సేవలు నిలిపి వేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ పి.విజయబాబు తెలిపారు. రాష్ట్రంలోని నాలుగు గ్రామీణా బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణా బ్యాంకుగా ఏర్పడిన నేపథ్యంలో అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రొళ్ల: గ్రామాల్లో ఆరోగ్య, ఆశ వర్కర్లు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, అప్రమత్తంగా ఉండాలని మలేరియ సబ్‌యూనిట్ అధికారి షమీవుల్లా, డాక్టర్ శివానంద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రత్నగిరిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఆరోగ్య, ఆశ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఘర్షణలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

అగళి: క్షణికావేశంలో ఘర్షణలు పడి జీవితాలు నాశన చేసుకోవద్దని మడకశిర రూరల్ సీఐ రాజకుమార్, ఎస్ఐ వీరేష్ సూచించారు. మంగళవారంమండల పరిధిలోని నరసబుందిలో గ్రామస్తులతో బహిరంగ సభ నిర్వహించి పలు సూచనలు చేశారు.

రేషన్‌కార్డుల్లో మార్పులకు అవకాశం

పెనుకొండ రూరల్: స్మార్ట్ రేషన్‌కార్డుల్లో మార్పు చేర్పులకై గ్రామ, వార్డు సచివాలయాలు, మన మిత్ర వాట్సాప్ సర్వీసు ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు సీఎస్‌డీటీ ప్రభావతి తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకూ ఎలాంటి రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్లాస్టిక్ వినియోగదారులకు జరిమానా

మడకశిర: పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటిస్తున్నారా?లేదా?అని ఆయన పలు దుకాణాలు, చికెన్ సెంటర్లలో తనిఖీలు చేశారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో ఉన్న పలు చికెన్ సెంటర్లలో ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నట్లు కమిషనర్ తనిఖీలో బయటపడింది. దీంతో రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఇస్తామని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 5న పరీక్ష నిర్వహించిన నారాయణ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నందీష్, నాగేంద్ర, లక్ష్మీపతి, మంజునాథ్, నాజీర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

హిందూపురం: హిందూపురం సమీపంలోని సింగిరెడ్డిపల్లికి చెందిన ఇంటర్ చదివిన అక్షర (19) సోమవారం నుంచి కనిపించడంలేదని యువతి తల్లి సుజాత వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చీరలకు పాలిషింగ్ చేయించుకుని వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు.

ఓట్ల చోరీకి వ్యతిరేకంగా నేడు సంతకాల సేకరణ

మడకశిర: మండలంలోని నీలకంఠాపురంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు స్థానిక మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.



హిందూపురం: జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



మడకశిర: వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్



మడకశిర: వాల్మీకి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ఘనంగా వాల్మీకి జయంతి

సాక్షిబృందం: మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాల్మీకులతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూజల్లో పాల్గొన్నారు. వాల్మీకి చూపిన బాటలో పయణించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యం

మడకశిర: వైఎస్సార్‌సీపీ హయాంలోనే వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత లభించిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. పట్టణంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా కాగానే వాల్మీకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకున్నారన్నారు. అలాగే ఎంతో మందికి ఉన్నత పదవులు ఇచ్చారన్నారు. అలాగే పట్టణంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి,తెలంగాణ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మడకశిరలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'వాల్మీకి' ఆదర్శప్రాయుడు

చిలమత్తూరు: సన్మార్గాన్ని రామాయణం ద్వారా సమాజానికి చాటిచెప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం హిందూపురం పట్టణంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, వైఎస్సార్సీపీ నాయకులు శబరీష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, కార్యకర్తలు, వాల్మీకులు పాల్గొన్నారు. చిలమత్తూరులో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



హిందూపురం: వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న సమన్వయకర్త టీఎన్ దీపిక



హిందూపురం: సీతారాముడు, వాల్మీకి వేషధారణలో చిన్నారులు



పెనుకొండలో ...



రొద్దంలో జ్యోతులు మోస్తున్న మహిళలు



సోమందేపల్లిలో...



లేపాక్షి తహసీల్దార్ కార్యాలయంలో...